సురుచి స్వర్ణ గురి

యువ షూటర్‌కు వరుసగా రెండు పసిడి పతకాలు ● మను భాకర్‌కు రజతం

లిమా (పెరు): భారత యువ షూటర్ ఇందర్‌సింగ్ సురుచి ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో పసిడి పంట పండిస్తున్నది. ఇటీవలే బ్యూనస్ ఎయిర్స్(అర్జెంటీనా) వేదికగా ముగిసిన ప్రపంచకప్‌లో స్వర్ణంతో పాటు కాంస్యం నెగ్గిన ఈ 18 ఏండ్ల ఝుజ్జర్ (హర్యానా) అమ్మాయి.. మంగళవారం నుంచి లిమాలో మొదలైన టోర్నీలోనూ పసిడితో మెరిసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఈవెంట్‌లో సురుచి.. 243.6 పాయింట్లతో బంగారు పతకం సాధించింది. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యంతో సత్తాచాటిన మరో భారత అమ్మాయి మను భాకర్ (242.3) స్వల్ప తేడాతో రజతం గెలుచుకుంది. చైనా షూటర్ యావో (219.5) కాంస్యం నెగ్గింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో సురుచి (582), మను (578) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలవగా.. కీలకపోరులో సురుచి పలుమార్లు 10 పాయింట్ల సర్కిల్‌లో పాయింట్లు (చివరి 10 షాట్లలో 8 పది పాయింట్లు స్కోరు చేసినవే) రాబట్టి అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఆరంభంలో సురుచి కంటే ముందున్న చైనా అమ్మాయి తర్వాత గురి తప్పి కాంస్యంతో సరిపెట్టుకుంది. ఇదే టోర్నీ పురుషుల 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో సౌరభ్ చౌదరి కాంస్యం గెలిచాడు.

క్వార్టర్స్‌లో బోపన్న జోడీ

మునిచ్ (జర్మనీ): ఏటీపీ-500 ఈవెంట్ అయిన బెవెరియన్ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నీలో భారత ఆటగాడు రోహన్ బోపన్న, బెన్ షెల్టన్ (అమెరికా) జోడీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. సోమవారం రాత్రి జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఈ ఇండో-అమెరికన్ ద్వయం 6-4, 6-3తో జెమీ ముర్రే (ఇంగ్లండ్)-రాజీవ్ రామ్ (అమెరికా)ను ఓడించింది. ఇదే టోర్నీలో మరో భారత ఆటగాడు యుకీ బాంబ్రీ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టాడు.

జూనియర్ జహీర్ ఆగయా!

భారత మాజీ క్రికెటర్ జహీర్‌ఖాన్‌కు వారసుడొచ్చాడు. జహీర్ భార్య సాగరికా ఘాట్గె పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని సోషల్‌మీడియా వేదికగా జహీర్, సాగరిక బుధవారం అభిమానులతో పంచుకున్నారు.

శ్రీజ, మనిక నిష్క్రమణ

మకావు (చైనా): ఐటీటీఎఫ్ ప్రపంచకప్‌లో భారత స్టార్ ప్యాడ్లర్లు ఆకుల శ్రీజ, మనికా బాత్రా పోరాటం ముగిసింది. తొలి రౌండ్‌లో అలవోక విజయాలు సాధించిన ఈ ఇద్దరూ రెండో మ్యాచ్‌లో మాత్రం చేతులెత్తేయడంతో భారత్‌కు నిరాశే ఎదురైంది. గ్రూప్ స్టేజ్‌లో భాగంగా మహిళల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో శ్రీజ 0-4తో రోమేనియాకు చెందిన ప్రపంచ 13వ ర్యాంకర్ బెర్నడెట్టె చేతిలో చిత్తుగా ఓడింది. మరో పోరులో మనికా 1-3తో బ్రున టకహాషి (బ్రెజిల్)కి తలవంచింది. మనికా, శ్రీజ ఓటములతో ఈ టోర్నీలో భారత పోరాటం కూడా ముగిసినట్లైంది.

ఒలింపిక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లకు వేదిక ఖరారు

దుబాయ్: 128 ఏండ్ల తర్వాత ఒలింపిక్స్‌లో చోటు దక్కించుకున్న క్రికెట్ నిర్వహణలో మరో ముందడుగు పడింది. లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో ఆరు జట్లతో ఆడనున్న ఈ మెగా ఈవెంట్‌లో మ్యాచ్‌ల నిర్వహణ కోసం ఐసీసీ వేదికను ఖరారు చేసింది. సౌత్ కాలిఫోర్నియాలోని పొమొనలో ఉన్న ఫేర్‌గ్రౌండ్స్‌ను క్రికెట్ మ్యాచ్‌ల కోసం వినియోగించనున్నట్టు ఐసీసీ తెలిపింది. లాస్ ఏంజెల్స్‌లో ఒలింపిక్స్ జరిగే ప్రధాన వేదికకు పొమొనొ నగరం 48 కిలోమీటర్ల దూరంలో ఉంది. వాస్తవానికి ఇది క్రికెట్ స్టేడియం కాదు. ఏడాది పాటు ఇక్కడ కమర్షియల్ ఈవెంట్లు, కన్వెన్షన్లు, మోటార్ రేసింగ్ ఈవెంట్లు జరుగుతుంటాయి.

'సైజు' ముఖ్యం గురూ!

బ్యాట్లను తనిఖీ చేస్తున్న అంపైర్లు

ముల్లాన్‌పూర్: ఐపీఎల్-18లో గత నాలుగైదు మ్యాచ్‌ల నుంచి ఎవరైనా బ్యాటర్ క్రీజులోకి రాగానే అంపైర్లు వారి బ్యాట్లను తనిఖీ చేస్తున్న దృశ్యాలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ నడుస్తున్నది. మంగళవారం పంజాబ్, కోల్‌కతా మ్యాచ్ సందర్భంగా కేకేఆర్ బ్యాటర్లు సునీల్ నరైన్, ఆన్రిచ్ నోకియా బ్యాట్ల సైజ్ తేడా రావడంతో అంపైర్లు వాటిని మార్చాలని ఆదేశించారు. దీంతో ఈ ఇద్దరూ వేరే బ్యాట్లతో ఆడాల్సి వచ్చింది. ఐపీఎల్ చరిత్రలో ఇలా జరగడం ఇదే ప్రథమం. అయితే ఈ లీగ్‌లో ఇలాంటి దృశ్యాలు కొత్త అయినప్పటికీ నియమ నిబంధనలు మాత్రం పాతవే. గతంలో బ్యాటర్లు క్రీజులోకి తీసుకొచ్చే బ్యాట్లను డ్రెస్సింగ్ రూముల్లోనే కొలిచేవారు. కానీ ఇప్పుడు ఆన్‌ఫీల్డ్ అంపైర్ గానీ, బౌండరీ లైన్ వద్ద ఉండే మ్యాచ్ సిబ్బంది గానీ బ్యాట్లను పరిశీలిస్తున్నారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం బ్యాట్ వెడల్పు 10.79 సెంటీ మీటర్లకు మించకూడదు. బ్యాట్ మందం 6.7 సెం.మీ, పొడవు 96.4 సెం. మీ, బ్యాట్ అంచు వెడల్పు 4 సెం.మీ దాటకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నందునే అంపైర్లు నరైన్, నోకియా బ్యాట్లను మార్చారు.

ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులను కట్టిపడేసింది. ఆఖరి వరకు గెలుపు దోబూచులాడిన మ్యాచ్ ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెట్టింది. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన మ్యాచ్‌లో ఆఖరికి రాజస్థాన్‌పై ఢిల్లీ క్యాపిటల్స్‌దే పైచేయి అయ్యింది. నిర్ణీత ఓవర్లలో ఇరు జట్ల స్కోర్లు సమమయ్యాయి. దీంతో విజేతను నిర్ణయించేందుకు జరిగిన సూపర్ ఓవర్‌లో ఢిల్లీ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. మొత్తంగా ఈసీజన్‌లో జరిగిన తొలి సూపర్ ఓవర్‌లో రాజస్థాన్‌పై ఢిల్లీ జయకేతనం ఎగురవేసింది. అలవోకగా గెలువాల్సిన మ్యాచ్‌ను రాజస్థాన్ చేజేతులా వదులుకుని హ్యాట్రిక్ పరాజయాన్ని మూటగట్టుకుంది.

ఢిల్లీ సూపర్

సూపర్ ఓవర్‌లో ఉత్కంఠ విజయం

చేజేతులా మ్యాచ్ కోల్పోయిన రాజస్థాన్ ● జైస్వాల్, రానా అర్ధసెంచరీలు వృథా

ఢిల్లీ: ఐపీఎల్ మరో పోరు దుమ్మురేపింది! పంజాబ్ కింగ్, కోల్‌కతా నైట్‌రైడర్స్ లోస్కోరింగ్ మ్యాచ్ అభిమానుల మదిలో నుంచి చెరిగిపోక ముందే ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ పోరు పతాక స్థాయికి తీసుకెళ్లింది. బుధవారం జరిగిన ఈ సీజన్ తొలి సూపర్ ఓవర్ పోరులో రాజస్థాన్‌పై ఢిల్లీ ఉత్కంఠ విజయం సాధించింది. ఢిల్లీ నిర్దేశించిన 189 పరుగుల లక్ష్యఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 188/4 స్కోరు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్(37 బంతుల్లో 51, 3ఫోర్లు, 4సిక్స్‌లు), నితీశ్‌రానా(28 బంతుల్లో 51, 6ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీలతో విజృంభించారు. వీరిద్దరు ఢిల్లీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. ఆఖర్లో ధ్రువ్ జురెల్(17 బంతుల్లో 26, 2సిక్స్‌లు), హెట్‌మైర్(9 బంతుల్లో 15 నాటౌట్, ఫోర్) జట్టును గెలిపించేందుకు చేసిన ప్రయత్నం నెరవేరలేదు. స్టార్క్, అక్షర్, కుల్దీప్ ఒక్కో వికెట్ తీశారు. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ.. అభిషేక్ పొరెల్ (37 బంతుల్లో 49, 5 ఫోర్లు, 1 సిక్స్), కేఎల్ రాహుల్ (32 బంతుల్లో 38, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో 20 ఓవర్లలో 188/5 స్కోరు చేసింది. ఆర్చర్(2/32)కు రెండు వికెట్లు దక్కాయి.

జైస్వాల్, రానా రాణించినా:

ఛేదనలో రాయల్స్ ఇన్నింగ్స్ సైతం వేగంగానే ప్రారంభమైంది. శాంసన్ (19 బంతుల్లో 31 రిటైర్డ్ హర్ట్, 2 ఫోర్లు, 3 సిక్సర్లు), జైస్వాల్ దూకుడుగా ఆడారు. ఈ ఇద్దరూ ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన ముకేశ్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడారు. ముకేశ్ రెండో ఓవర్లో ఇద్దరూ తలా ఓ సిక్సర్ కొట్టారు. స్టార్క్ 3వ ఓవర్లో జైసాల్.. 4, 6, 4తో 19 రన్స్ రాబట్టాడు. పేసర్లతో లాభం లేదని అక్షర్.. స్పిన్నర్ విప్రాజ్‌కు బంతినివ్వగా శాంసన్.. ఓ ఫోర్, సిక్సర్‌తో అతడికి స్వాగతం పలికాడు. కానీ అదే ఓవర్లో కట్ షాట్ ఆడే క్రమంలో పక్కటెముకలు పట్టేయడంతో అతడు రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. శాంసన్ స్థానంలో వచ్చిన పరాగ్ (8) నిరాశపరిచాడు. 34 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తిచేసిన జైస్వాల్‌ను కుల్‌దీప్ ఔట్ చేశాడు. అప్పటికే క్రీజులో కుదురుకున్న రానా..అక్షర్‌పటేల్‌ను లక్ష్యంగా చేసుకుంటూ 15వ ఓవర్‌లో ఓ భారీ సిక్స్‌కు తోడు రెండు ఫోర్లతో అరుసుకున్నాడు. అయితే రానా నిష్క్రమణతో రాయల్స్ ఇన్నింగ్స్ గాడి తప్పింది. స్టార్క్ వేసిన ఆఖరి ఓవర్‌లో విజయానికి 9 పరుగులు అవసరం కాగా జురెల్ వికెట్ కోల్పోయిన రాజస్థాన్ 8 పరుగులకే పరిమితమైంది. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది.

సూపర్ ఓవర్ సాగిందిలా..

రాజస్థాన్	బాల్స్	ఢిల్లీ
0	1	2
4	2	4
1	3	1
4+నోబాల్	4	6
1+ఔట్	4	
ఔట్	5	
11/2	మొత్తం	13/0

అభిషేక్, అక్షర్ మెరుపులు

పొరెల్ మెరుపులతో ఢిల్లీ ఇన్నింగ్స్ ధాటిగానే మొదలైనా పవర్ ప్లేలో రెండు కీలక వికెట్లు కోల్పోయాక ఆ జట్టు స్కోరువేగం నెమ్మదించింది. తుషార్ రెండో ఓవర్లోనే పొరెల్.. 4, 4, 6, 4, 4తో 23 రన్స్ పిండుకున్నాడు. కానీ ఈ సీజన్‌లో తడబడుతున్న ఫ్రేసర్ మెక్‌గర్క్ (9).. ఆర్చర్ మొదటి ఓవర్లోనే బ్యాక్ టు బ్యాక్ బౌండరీలు బాదినా అతడే వేసిన 3వ ఓవర్లో జైస్వాల్ చేతికి చిక్కడంతో ఢిల్లీ తొలి వికెట్ కోల్పోయింది. గత మ్యాచ్‌లో అదిరిపోయే ఇన్నింగ్స్ ఆడిన కరుణ్ నాయర్.. పొరెల్‌తో సమన్వయం లోపించి పరుగులేమీ చేయకుండానే రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత ఢిల్లీ పరుగుల వేటలో వెనుకబడింది. రాహుల్ (38).. బంతికో పరుగన్నట్టుగానే ఆడగా ఆరంభంలో రెచ్చిపోయిన పొరెల్ కూడా వేగంగా ఆడలేకపోయాడు. ఆర్చర్ రాహుల్‌ను ఔట్ చేయగా హసరంగ బౌలింగ్‌లో అర్ధశతకానికి ఒక్క పరుగు దూరంలో పొరెల్ నిష్క్రమించాడు. అక్షర్ (14 బంతుల్లో 34, 4 సిక్సర్లు, 2 సిక్సర్లు) ఢిల్లీ ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చాడు. హసరంగ ఓవర్లో 4, 4 ,6తో రెచ్చిపోయిన ఢిల్లీ సారథి.. తీక్షణ 16వ ఓవర్లో 6, 4, 4తో అలరించాడు. ఆఖర్లో స్టబ్స్ (34 నాటౌట్), అశుతోశ్ (15 నాటౌట్) ఢిల్లీకి పోరాడే స్కోరునందించారు.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 188/5 (పొరెల్ 49, రాహుల్ 38, ఆర్చర్ 2/32, హసరంగ 1/38); **రాజస్థాన్:** 20 ఓవర్లలో 188/4(జైస్వాల్ 51, రానా 51, అక్షర్ 1/23, కుల్దీప్ 1/33)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
ఢిల్లీ	6	5	1	10	0.74
గుజరాత్	6	4	2	8	1.08
బెంగళూరు	6	4	2	8	0.67
పంజాబ్	6	4	2	8	0.17
లక్నో	7	4	3	8	0.08
కోల్‌కతా	7	3	4	6	0.54
ముంబై	6	2	4	4	0.10
రాజస్థాన్	7	2	5	4	-0.71
హైదరాబాద్	6	2	4	4	-1.24
చెన్నై	7	2	5	4	-1.27

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

ఐపీఎల్‌లో హైదరాబాదీ ఫిక్సింగ్ కలకలం!

హైదరాబాద్: ఐపీఎల్‌లో హైదరాబాదీ ఫిక్సింగ్ కలకలం రేపింది. సాఫీగా సాగుతున్న లీగ్‌లో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి మ్యాచ్ ఫిక్సింగ్ చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. దీంతో వెంటనే అప్రమత్తమైన భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ఐపీఎల్ ఫ్రాంచైజీ యాజమాన్యాలను, ప్లేయర్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, వ్యాఖ్యాతలను అలర్ట్ చేసింది. హైదరాబాద్‌కు చెందిన సదరు వ్యాపారికి పంటర్లు, బుకీలతో దగ్గరి సంబంధాలు ఉండటంతో పాటు గతంలోనూ ఫిక్సింగ్ చేసిన చరిత్ర ఉన్నట్లు యాంటీ కరప్షన్ సెక్యూరిటీ యూనిటీ(ఏసీఎస్‌యూ) గుర్తించింది. ఖరీదైన బహుమతులకు తోడు బంగారు ఆభరణాలను ఎరగా వేస్తూ ఫిక్సింగ్ చేసే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. అభిమానిగా చెలామణి అవుతూ ప్లేయర్లు బస చేసే హోటల్స్‌తో పాటు ప్రత్యేక కార్యక్రమాలకు ఆహ్వానిస్తూ ఫిక్సింగ్‌కు పాల్పడేందుకు ప్రణాళికలు చేసినట్లు సమాచారం.

కెనడా, నైజీరియా నుంచి తీవ్ర పోటీ

ఢిల్లీ: 2030లో కామన్వెల్త్ క్రీడల బిడ్‌ను దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్న భారత్‌కు కెనడా, నైజీరియా నుంచి తీవ్ర పోటీ ఎదురవుతున్నది. కెనడా, నైజీరియాతో పాటు మరో రెండు దేశాలూ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) వ్యక్తం చేసినట్టు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాల సమాచారం. అయితే మిగిలిన రెండు దేశాల పేర్లు మాత్రం తెలియరాలేదు.